# ఏటా 10-12 కొత్త ఔషధాలు

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఔషధ కంపెనీ ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ఉత్పత్తి, పరిశోధన- అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సదుపాయాలను బహుముఖంగా విస్తరించనుంది. రూ.200 కోట్లు వెచ్చించి వచ్చే రెండేళ్లలో నూతన ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) యూనిట్లను, ఆర్ అండ్ డీ కేంద్రాన్ని, ఫార్ములేషన్ల యూనిట్‌ను నిర్మించనున్నట్లు ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి 'న్యూస్‌టుడే' ఇంటర్వ్యూలో వెల్లడించారు. సొంత ఆర్ అండ్ డీ సామర్థ్యంతో ఏటా దేశీయ మార్కెట్లో పది, పన్నెండు కొత్త ఔషధాలు ప్రవేశపెట్టే దిశగా ముందుకు సాగుతున్నామని వివరించారు. దేశంలోనే తొలిసారిగా 'ప్రసుగ్రెల్' అనే జనరిక్ ఔషధాన్ని విడుదల చేసేందుకు భారత ఔషధ నియంత్రణ మండలి (డిసిజిఐ) నుంచి ఈ కంపెనీ అనుమతి పొందింది. దీన్ని ఇతర ఔషధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని దేశీయ మార్కెట్లోకి విడుదల చేసే సన్నాహాల్లో ఉంది.

**● రూ.200 కోట్లతో కొత్త సదుపాయాలు ● విస్తరణ దిశగా ఎంఎస్ఎన్ లేబొరేటరీస్**

## 'న్యూస్‌టుడే'తో సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి



కంపెనీకి ప్రస్తుతం 3 ఏపీఐ యూనిట్లు, ఒక ఫార్ములేషన్ యూనిట్ ఉన్నాయి. 80కి పైగా ఏపీఐలు, 100 వరకూ ఫార్ములేషన్లను తయారు చేయడంతోపాటు యూఎస్ఏ, యూరప్‌లలో 30 వరకూ డీఎంఎఫ్‌లు దాఖలు చేశారు. ఔషధ పరిశోధన, తయారీకి అనుగుణంగా ప్రస్తుత యూనిట్లను విస్తరించడంతో పాటు ఒక పరిశోధనా కేంద్రాన్ని పాశమైలారంలో నిర్మిస్తున్నారు. వీటిపై వచ్చే రెండేళ్లలో రూ.100 కోట్లు ఖర్చు చేస్తారు. ఇవి కాకుండా జడ్చర్ల ఫార్మా ఎస్ఈజడ్‌లో నూతన ఏపీఐ యూనిట్, మరొక ఫార్ములేషన్ యూనిట్‌ను హైదరాబాద్‌లో లేదా విశాఖపట్టణంలో నిర్మించడానికి రూ.100 కోట్లు వెచ్చిస్తారు. మొత్తం రూ.200 కోట్లను అంతర్గత వనరులు, బ్యాంకు రుణాలతో సమకూర్చుకుంటారు.

### రక్తం గడ్డకట్టనివ్వని ఔషధం

'ప్రసుగ్రెల్' ఔషధాన్ని రక్తం గడ్డ కట్టకుండా ఉండటానికి వినియోగిస్తారు. దీన్ని కనుగొన్న కంపెనీలైన లిల్లీ-దాయిచీ గత ఏడాదే 'ఎఫియంట్' అనే పేరుతో ప్రపంచ మార్కెట్లో విడుదల చేశాయి. మన దేశంలో ప్రస్తుతం ఇది అందుబాటులో లేదు. స్వల్ప కాలంలోనే దీనికి జనరిక్ ఔషధాన్ని ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ తయారు చేసింది. హృద్రోగులకు యాంజియోప్లాస్టీ ఆపరేషన్ చేసినప్పుడు రక్తం గడ్డకుండా ఉండేందుకు 'ప్రసుగ్రెల్' ఔషధాన్ని ఇస్తారు. 5ఎంజీ, 10 ఎంజీ డోసుల ట్యాబ్లెట్ల రూపంలో మార్కెట్‌కు దీన్ని అందించనుంది.

### ఎంఎన్‌సీలతో భాగస్వామ్యాలకు సిద్ధం

ఎంఎన్‌సీ ఫార్మా కంపెనీలు ఇటీవల కాలంలో భారతీయ కంపెనీలతో జాయింట్ వెంచర్లకు, భాగస్వామ్యాలకు సిద్ధపడుతున్న విషయం విదితమే. ఇటువంటి అవకాశం వస్తే తాము అందిపుచ్చుకుంటామని ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఇప్పట్లో ఐపీఓకు వెళ్లే ఆలోచన లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### ఐదేళ్లలో రూ.1,000 కోట్ల కంపెనీ

ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.390 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.250 కోట్ల నుంచి టర్నోవర్ గణనీయంగా పెరగడం గమనార్హం. వచ్చే అయిదేళ్లలో రూ.1,000 కోట్ల స్థాయికి విస్తరించాలనే తమ లక్ష్యంగా ఎంఎస్ఎన్ రెడ్డి వెల్లడించారు. అన్ని కంపెనీలు చేసే ఔషధాలు కాకుండా, ముఖ్యమైన ఔషధ విభాగాల్లో తాము ఉన్నామని వివరించారు.

– న్యూస్‌టుడే, హైదరాబాద్